


# ( 1967 లో ఆంధ్రప్రభలో సీరియల్ గా వచ్చిన నవల పునర్ముద్రణ)

(గత సంచిక తరువాయి)

29

**నరసింహం రాజమహేంద్రవరం** వచ్చిన నాలుగు రోజుల తరవాత పనిలో చేరాడు. ఆల్కాటుతోటలో షెడ్డుకు దగ్గిరగా ఇల్లు తీసుకున్నాడు. రెండు గదులు, వంటిల్లు, సామానుగది, చిన్న పెరడుగల ఒక వాటా దొరికింది. నెలకు ఇరవై రూపాయలు అద్దె.

రాజమహేంద్రవరంలో పెద్దదొర దగ్గిర కాగితం ఇచ్చాడు. తరవాత లైనుమీద పంపమని చిన్నదొర దగ్గిరకు పంపించారు. చిన్నదొరను చూచి నరసింహం వెంటనే గుర్తుపట్టాడు. చిన్నదొర ఉత్తరం చదివి నరసింహాన్ని తేరిపారచూచాడు. తరవాత గుర్తించాడు. పళ్లు పటపట కొరికాడు.

"సాన్నాళ్ల తరవాత దొరికినావు... సూడు నీ పని నీ అంతు కనుక్కోకపోతే నేను దొరని కాను" అని అన్నాడు.

నరసింహం జవాబు చెప్పలేదు. మెల్లిగా నవ్వాడు.

"కష్టపడేవాళ్లకు ఎప్పుడు భయంలేదు" అని చక్కని ఇంగ్లీషులో జవాబు చెప్పాడు.

పుండుమీద కారం చల్లినట్లయింది. దొర నరసింహాన్ని కిందినించి మీదివరకు చూచాడు.

"బ్లడీ బగర్, ఇంగ్లీషులో మాట్లాడుతున్నావే?" అన్నాడు దొర ఇంగ్లీషులో.

"దొరగారు కొంచెం సరియైన భాషలో మాట్లాడాలి. భాష రాకపోతే మానేయవచ్చు. గాని మర్యాద తక్కువ మాటలు పనికిరావు!" అన్నాడు నరసింహం ఇంగ్లీషులో. పక్కనున్న పనివాళ్లు అతనివైపు చూచారు. దొరవైపు చూచారు.

"కథ అంతవరకు వచ్చిందా?" అని అడిగాడు దొర.

"అవును అధికంగా మీతో ప్రసంగించదలచలేదు. నా ఇంటి ఎడ్రసు ఇదిగో. ఎప్పుడు ఎవరితో పనికి వెళ్లవలిసి ఉంటుందో ఇంటికి కబురు చేయండి" అని నరసింహం విసురుగా ఆఫీసునుండి బయటికి నడిచాడు.

తల్లికి ఉత్తరం వ్రాశాడు. వారం పది రోజులలో మంచిరోజు చూచుకొని రాజమహేంద్రవరం రావాలిసిందని, పప్పులు, ఉప్పులు తనతో తీసుకుని రా నవసరంలేదని, వండుకునేపాత్రలు తీసుకురావలిసి ఉంటుందని వ్రాశాడు.

మరి రెండురోజులవరకు నరసింహానికి ఉద్యోగానికి పిలుపు రాలేదు. ఆ రెండు రోజులు నరసింహం ఇల్లు కదిలివెళ్లడానికి వీలయింది కాదు. ఎప్పుడు పిలుపు వస్తుందో! పిలుపువచ్చినప్పుడు ఇంటిదగ్గిర ఉండకపోతే నేరమే. రెండు వారాలు లైనుమీద అన్ని తెలుసుకోడానికి నరసింహాన్ని పంపారు.

మూడోవారంలో రాజమహేంద్రవరం నుండి వాల్తేరుపోయే గూడ్సుబండిలో మొదటి ఫైరుమనుగా స్వతంత్రంగా పనిచేయడానికి నరసింహాన్ని పంపించారు. ఈ పనికి నరసింహం కొత్తవాడంటే కొత్తవాడుకాదు. చాలాసార్లు రెండవ ఫైరుమనుగా పనిచేస్తున్నప్పుడు మొదటి ఫైరుమను పని కూడా సాయం చేశాడు. స్వంతంగా కొద్దిసార్లు పనిచేశాడు. అందుచేత భయపడవలసిన అవసరంలేదు.

రెండవ ఫైరుమనుగా వచ్చినవాడు నరకేసరి. మనిషి ఆరడుగులు పొడవు ఉంటాడు. బలశాలి. బొగ్గురంగుకి అతని రంగుకి భేదంలేదు. అతను నవ్వుతూ మాట్లాడుతూంటే ముత్యాలవంటి అతని పలువరుస మెరిసేది. అతనుకూడా తన పనికి కొత్తవాడే.

ఇక డ్రైవరు శంకరయ్య యాభై ఏళ్లవాడు. కాయశరీరం. కోపిష్ఠి. కసురుకుంటూ మాట్లాడతాడు. అతనికింద పనిచేసినవాళ్లు మెయిలు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మంచి నీళ్లలా సారా తాగుతాడు. అతను వచ్చి ఇంజనుసీటుమీద కూర్చుంటాడు. తెలివిగా ఉంటే బండి ఆపమని, వేగంగా పోనీయమని మొదటి ఫైరుమనుకు చెప్పి నడిపిస్తాడు. తెలివి లేనప్పుడు మొదటి పైరుమను చూసుకోవలిసిందే.

గూడ్సుబండి సాయంకాలం అయిదున్నరకు రాజమహేంద్రవరం విడిచిపెట్టింది. ఇంజను ఎక్కిన శంకరయ్య, వెనక టెండరు పెట్టెమీద కూర్చున్నాడు. బుడ్డివిప్పి డోసు వేసుకున్నాడు. తరవాత పదాలు పాడడం మొదలుపెట్టాడు.

నరసింహం ఇప్పుడు అర్థం చేసుకున్నాడు, చిన్నదొర ఏ విధంగా తన కసి తీర్చుకున్నాడో. డ్రైవరు తాగుబోతు. మిగిలిన ఇద్దరు కొత్తవాళ్లు. బండి సకాలంలో చేరకపోయినా, దారిలో పాడయినా, నరసింహాన్ని సులువుగా శిక్షించవచ్చు.

నరసింహం నవ్వుకున్నాడు. నరకేసరిని పిలిచాడు.

"నరకేసరిగారూ! మీరు కొత్తవారు. ఇంజను నడిపించడం తెలుసుకోవచ్చు. గాని ఆపడంకూడా తెలిసి ఉండాలి. ఈ ఇంజను మీరు, నేను నడపవలిసి ఉంది. ఇంజనుభాగాలలో నూనె వెయ్యడం, బొగ్గులు చిన్నవిగా కొట్టడం మీరు చేయవలిసిన పనులు. ఇక్కడ బాయిలరులో నీరు చూపించే గ్లాసు ఒకప్పుడు పగిలిపోతుంది. అప్పుడు తుపాకి

పేల్చినంత శబ్దం రావచ్చు. భయపడకండి. దళసరిగా ఉన్న పై అద్దాలు ఆ గాజుపెంకులను తగలనీయవు. రెండవది రైలు ఆపడం... ఇది వ్యాక్యూము బ్రేక్ హాండిలు. దీనిని పూర్తిగా క్రిందకు లాగాలి. స్టీము కట్టివేయాలి. కొత్తవారందరు ఈ చిన్నవిషయాలు ముందుగా తెలుసుకోవాలి" అని అన్నాడు నరసింహం.

నరకేసరి సరదాగా పనిచేశాడు. తుని దగ్గిర ఇంజనుకు నీళ్లు పట్టి, నిప్పుచేసి, తిరిగి బయలుదేరారు. శంకరయ్య అలా తాగుతూనే ఉన్నాడు. పదాలు పాడుతున్నాడు. నరసింహం ఇంజను సరిగా నడుపుతున్నాడు. నిప్పుకోసం బొగ్గు వేస్తున్నాడు. అనకాపల్లి కూడా దాటింది.

వెనక ఉన్న టెండరుబొగ్గు ముందుకు తొయ్యడానికి నరికేసరి టెండరు ఎక్కిపోయాడు. బండి అనకాపల్లి విడిచిపెట్టింది. తెల్లవారుఝాము అవుతున్నది. ఇంజను కాస్త వేగంగా పరిగెడుతున్నది. సిగ్నలు కోసం చూస్తున్న నరసింహానికి దభీమన్న చప్పుడు వినిపించింది. నరసింహం తిరిగిచూచాడు. శంకరయ్య టెండరు పెట్టిమీదనించి క్రింది ఫుట్ ప్లేటుమీద పడ్డాడు. నరసింహం వెనక్కి వచ్చేలోగా అతను లేవబోయాడు. లేచి తూలిపోతున్న అతనిని నరసింహం చేతులతో పట్టుకున్నాడు. శంకరయ్య పట్టు విడిపించుకోడానికి ప్రయత్నంచేస్తూ ఇంజనుమీదికి ఎక్కబోయే దండాల మధ్య నరసింహతోపాటు పడిపోయాడు. శంకరయ్య తల, చేతులు కొంతవరకు రొమ్ము, దండాలకు పైగా వేలాడుతున్నాయి. పడిపోయిన శంకరయ్యను లోపలికి లాగడానికి ప్రయత్నిస్తున్న నరసింహానికి పట్టు దొరకలేదు. పట్టు కోసం శంకరయ్య ప్రయత్నించిన కొద్ది, బైటికి జరిగిపోతూ నరసింహం పట్టునుంచి తప్పించుకుంటున్నాడు.

ఇంజన్ వేగం అందుకొంది. నరసింహం శంకరయ్యను పట్టుకొని కడుపుమీద వెనకకు రావడానికి పాకుతూ అవస్థపడ్డాడు. నరకేసరిని గట్టిగా అరిచి పిలిచాడు. గాలిలో, వేగంలో ఆ మాటలు నరకేసరి చెవినిబడేసరికి దువ్వాడస్టేషను సమీపిస్తున్నది. టెండరునుండి ఇంజనులోకి వచ్చే కొద్ది జాగాలో బొగ్గులు తోసివేయడం చేత వెంటనే అతనికి రావడానికి వీలయిందికాదు.

శంకరయ్య కాళ్లుమాత్రం నరసింహం పట్టులో ఉన్నాయి. మిగిలిన శరీరం వేలాడుతున్నది. నరసింహం ముఖం బైటికి వచ్చింది. అతను స్టేషనువేపు చూచాడు. ఔటరుసిగ్నలు డేంజరులో ఉంది. స్టేషను ప్లాట్ ఫారంమీద ప్యాసింజరు ట్రెయిను ఒకటి ఉంది.

నరసింహం కలవరపడిపోయాడు. తన ప్రాణం పోయినా భయంలేదు. వందలకొలది ప్రయాణికుల ప్రాణాలు పోతాయి. శంకరయ్యను వదిలి బ్రేకువేస్తే శంకరయ్య ఆ వేగానికి కిందపడి నామరూపాలు లేకుండా పోతాడు. లేకపోతే వందల కొలది ఆహుతి అయిపోతారు.

రైలు అవుటర్ డేంజరుసిగ్నలు దాటింది. నరసింహం "నరకేసరీ" అంటూ పెద్దబొబ్బ పెట్టాడు.

నరకేసరి అతిప్రయాసతో, బొగ్గులలో దూరి, దారిచేసుకొని, లోనికివచ్చి బ్రేకువేశాడు. అప్పటికి ఇంజను సిగ్నలు దాటుతూంది. ఇంజనుస్టీము కట్టివేశాడు.

గూడ్సుబండీ వేగం తగ్గినా, వెళ్లి నిలబడ్డ ప్యాసింజరు బండిని ఢీకొంది. పెద్ద శబ్దమయింది. శంకరయ్యతో పాటు నరసింహం ఆ సంఘర్షణకు దూరంగా వెళ్లి పడిపోయాడు. నరకేసరి ఇంజను ఆపే ప్రయత్నంలో బ్రేకుహాండిలు పట్టుకునే ఉండిపోయాడు. బళ్లు గుద్దుకోగానే వెనక్కి పడిపోయాడు ఇంజనులోనే.

అప్పుడు భూమ్యాకాశాలను కలిపే రోదనధ్వనులు నలువైపుల నిర్గమించాయి.

## 30

ఎండజోరు కొంచెం తగ్గింది. విశాఖపట్నం బీచిరోడ్డుమీద పోతున్న డాక్టరు శ్రీనివాసరావుకారు హవామహలు, రామకృష్ణాశ్రమందాటి, మరికొద్ది దూరంలో ఆగింది.

శ్రీనివాసరావు ముందు దిగి వెనకతలుపు తీశాడు. అతని చెల్లెలు ఉషారాణి, శారద దిగివచ్చి అతనితో కలిసి ఇసుకవేపు నడిచారు. ఉషారాణి, శారద ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్సుకాలేజీలో ఫిలాసఫీ ఆనర్సు చదువుతున్నారు. ఇళ్లుకూడా ఇరుగుపొరుగున కలెక్టరాఫీసుకి కొంచెం దూరంలో ఉన్నాయి. ఉషారాణి కొంచెం ఉషారయినది. శారదను చూసిన దగ్గరనించీ ఆమెకొక సంకల్పం కలిగింది. ఆమె తన వదినగారయితే బాగుంటుందని అనుకుంది. శారద తరుచు ఉషారాణిగారి ఇంటికి వచ్చేది. శ్రీనివాసరావు ఎమ్.ఎస్. పాసయ్యాడు. కింగ్ జార్జి హాస్పిటల్ లో సర్జనుగా పనిచేస్తున్నాడు.

అందమైన శారదను చూచిన తరవాత అతని మనస్సులో కూడా కోరిక మెదిలింది. ఆమె ఆనర్సు ప్యాసయిన తరవాత పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అనుకున్నాడు.

సుబ్రహ్మణ్యం లా చదువుతున్నాడు. అతనికికూడా శారదను శ్రీనివాసరావుకిచ్చి పెళ్లిచేస్తే బాగుంటుందని తోచింది.

పార్వతమ్మగారికి, కామమ్మకుకూడా ఇటువంటి సదభిప్రాయాలే ఉన్నాయి.

శ్రీనివాసరావు తండ్రి నాగభూషణంగారు రిటైర్డు హైకోర్టుజడ్జీ. ఆయనకు, ఆయన భార్య సుగుణాంబకుకూడా శారదమీద అభిమానముంది. తమ ఇంటి కోడలుగా శారద వస్తే, తమ జన్మ సఫలమౌతుందని వాళ్లు అనుకున్నారు.

అందరి అభిప్రాయాలముందు శారదకు తన అభిప్రాయమేదో తెలిపే స్వాతంత్ర్యంగాని, అవకాశంగాని లభించలేదు. ఆమెకు ప్రవాహానికి ఎదురీదేశక్తి లేదు. కాబట్టి అందరి అభిప్రాయాల ప్రవాహంలో ఆమె కొట్టుకుపోయింది.

వాళ్లు ముగ్గురు ఇసకలో కూర్చున్నారు. పిచ్చాపాటి మొదలయింది. ఉషారాణి మంచిమాటకత్తె. శారదచేత తన అన్నఎదట మాట్లాడించడానికి ప్రయత్నం చేసేది. శారదకు వినడం చేతనవును.

శ్రీనివాసరావు ఈ సాయంకాలం సంభాషణకు ఉపక్రమించాడు.

"దువ్వాడలో జరిగిన రైలు ప్రమాదంలో దెబ్బలు తగిలినవారిని ఆస్పత్రిలో చేర్చారు. చేతులు విరిగినవారు, కాళ్లు విరిగినవారు కొద్దిమంది. ప్రాణాలు పోయినవారు మాత్రం లేరు. రైలు ఆపిన ఫైరుమనుకు కూడా పెద్దదెబ్బలు తగలలేదు. డ్రైవరుకి దెబ్బలు తగిలాయి. అతను ఆసుపత్రికి వచ్చేటప్పటికి తెలివిగానే ఉన్నాడు. కట్లుకట్టి పంపించాము, రెండు రోజులుంచి. కాని అతని మొదటి ఫైరుమనుకు నాలుగు రోజులవరకు తెలివిరాలేదు. అతనికి దెబ్బలు తగిలాయి. ఎడమచేయి ఎముక విరిగింది. ఆపాటి దెబ్బలు తగిలినవారిలో తెలివితప్పిన వారులేరు. మనుష్యుడి మనస్సు ఎటువంటిదో, అతని కోరికలు ఎటువంటివో ఒకప్పుడు తెలివిలేనివారి నోటంట వలువడుతవి" అన్నాడు శ్రీనివాసరావు.

"చాలా విచిత్రంగా ఉందే. ఈ కేసో కథలా నడుస్తున్నది" అంది ఉషారాణి. శారద శ్రద్ధగా వింటున్నది.

"హాస్పిటల్ లో చేర్చిన నాటిరాత్రి ఆపరేషను తరవాత అతనికి జ్వరం వచ్చింది, సంధి కూడా. నాకు ఆశ్చర్యమయింది. అతనిని బ్రతికించాలని నాకో బలమైన కోరిక కలిగింది. అతను చేసేపని బొగ్గులు కొట్టడం. శరీరం బలంగా ఉంది. రక్తస్రావం బాగా అయినా అతని బలం తగ్గినట్లు కనిపించలేదు. గాని అతను సంస్కారంగల విద్యావంతుడని నాకు తోచింది."

"చాలా ఆశ్చర్యంగా ఉందే" అంది ఉషారాణి.

శారద వింటున్నది. ఆమె ముఖంలో ఆత్రత, ఆందోళన గోచరించాయి.

"నేను రెండు రాత్రిళ్లు ఆ పేషెంటుదగ్గిర గడిపాను. నాతోబాటు నా అసిస్టెంటులుకూడా కూర్చునేవారు. మొదటి రాత్రి అతను ఒకటే అరుపులు. మధ్యమధ్య 'వేలాది ప్రయాణికులు... అయ్యో! వేలాది ప్రయాణికులు... హరహర!' అని. 'రైలాపు! రైలాపు!... నరకేసరీ...' అని అరిచేవాడు. మరునాడు జ్వరం కొంచెం తగ్గింది. అరుపులు తగ్గాయి. ఆహారంలేక బలహీనంగా ఉన్నాడు. ఆ రాత్రికూడా నేను కూర్చున్నాను. అతను చక్కగా ఎవరినో పిలిచి కథ చెప్పినట్లు మాట్లాడుతూపోయాడు. రాత్రి పన్నెండు గంటలయింది. నిద్రపోయాడనుకున్నాను. అతను మైకంలోనే ఉన్నాడు. అతను అంటున్న మాటలు ఇంకా జ్ఞాపకం ఉన్నాయి. 'ఆమె వచ్చింది. ఆమె కళ్లలో ఏవో మధురమైన భావాలు కదలాడినవి. పెద్దదయ్యేమామిడిచెట్టు నీడను చూస్తూ తల ఎత్తి నా కళ్లలోకి చూచింది. ఆ చూపులతో నా హృదయం లాక్కున్నది. నా చూపులో కలిసిన చూపులు మరల్చుకోలేకపోయింది. నాకూ ఆమెకు మధ్య యోజనాలు దూరం. చూపులు కలిసినంత మాత్రాన మనసులు నిలిపినంతమాత్రాన, ఒకరికొకరము దగ్గర కాగలమా!' తరవాత మరికొంచెంసేపు అతను మాట్లాడలేదు... ఒక గంట తరవాత మళ్లా మాట్లాడాడు. 'నా మనస్సు స్వాధీనంలో లేదు. నావంటి సామాన్యుడు అంతస్తులెరగకుండా వలపు నిలపడంలో ప్రయోజనమేమున్నది? కానీ ఆమెను హృదయంలో ఆరాధించుకునే అధికారాన్ని ఎవరు కాదంటారు? నా జీవితం ఈ ఆరాధనలోనే మధురంగా గడిచిపోతుంది!'... అతని మాటలు వినడానికి బాగా ఉన్నాయి."

"అన్నయ్యా! మాకు అతన్ని చూపించలేకపోయావా?" అంది ఉషారాణి. శారదముఖంలో కలిగే మార్పులను శ్రీనివాసరావు గమనించకపోలేదు. ఆమె కన్నులనుండి కారిన రెండు కన్నీటిబొట్లు, ఆందోళనతో కదిలే పెదవులు ఆమె మనస్సును బైటపెట్టాయి.

"అతనికి తెలివి వచ్చింది నాలుగో రోజు. మరి నాలుగు రోజుల తరవాత అతనికీ సంగతులు చెప్పాను. సిగ్గుపడ్డాడు. 'రహస్యాన్ని దాచుకోలేకపోయాను డాక్టరుగారూ! ఈ నా కోరిక పరమపవిత్రమైనది' అని అన్నాడు. ఆయన వెళ్లిపోయాడు మరి వారం రోజుల తరవాత. విశాలమైన అతని కళ్లు తీయనికోరికలు వెలిబుచ్చాయి. మాటలు మధురంగా మనస్సును వశం చేసుకున్నాయి. ప్రవర్తన అతి సరళంగా ఆదర్శవంతంగా తోచింది" అన్నాడు శ్రీనివాసరావు.

"చాలా అద్భుతంగా ఉందే!..." అంది ఉషారాణి.

శారద పెదవి కదిపి ఒక్క పలుకైనా పలకలేదు. గాని మనస్సులోని భావాలను దాచుకోలేకపోయింది. శ్రీనివాసరావు గుర్తించాడనిగాని లేదనిగాని ఆమెకు తలపేలేదు. జాలిగుండెగల శారదలో ఆ భావాలు కలిగినవని ఉషారాణి అనుకుంది. చెప్పిన సంగతులకన్న అధికంగా విన్న శ్రీనివాసరావు శారదముఖంలో గల మార్పులను అర్థంచేసుకున్నాడు. అన్వయించుకున్నాడు.

## 31

జానకి మంచంమీద కూర్చుంది. నెలలు నిండాయి. నరసింహం ఆమె మంచానికి దగ్గిరగా కుర్చీమీద కూర్చున్నాడు. గోదావరిలో స్నానం చేసివచ్చి, మడిబట్ట కట్టుకొని సుబ్బమ్మ వంటచేస్తున్నది. వంటచేస్తూ, గదిలోకి వచ్చింది.

"మీ బావ పండుగకు వస్తాడో రాడో తెలియదు. పిలుపులు చాలలేదని, నువ్వు ఉత్తరం వ్రాయలేదని, జానకి అత్తగారు అన్నారు. నువ్వు పునర్జన్మపొందావని వాళ్లకు కొంచమైనా తలపులేదుగదా! నిన్నూ, నీ ఉద్యోగాన్ని ఆడిపోయడం వాళ్లవంతు. ఈ సారి తప్పకుండా నువ్వు ఉత్తరం వ్రాయి, నాయనా! ఈ పండుగకు మన మందరం కలిసి ఉంటే అదే పదివేలు!" అంది సుబ్బమ్మ.

"అమ్మా! నువ్వు ఉత్తరం వ్రాస్తే ఒకటి, నేను వ్రాస్తే ఒకటీనా? వాళ్లమనస్సులో ఎటువంటి అభిప్రాయాలు ఉన్నాయో! గోపాలం వ్రాసిన సంగతులు తలుచుకుంటూంటే చాలా బాధ వేస్తున్నది. మనం కట్నంక్రింద ఇచ్చిన భూమి తాకట్టు పెట్టారని, తోటను అమ్మివేయడానికి ప్రయత్నిస్తున్నారని, బేరాలు తీసుకువస్తున్నారని వ్రాశాడు. ఈ భూములు ఎప్పటినుంచో తరంవారీగా అనుభవిస్తున్నాము. వీటిలో జానకికి కొన్ని ప్రాప్తించడం సమంజసం. గాని అమ్మివేయడం మాత్రం మంచిపనికాదు" అన్నాడు నరసింహం.

"అన్నయ్యా! నువ్వు చెప్పినవన్నీ బాగానే ఉన్నాయి. ఎంత తెచ్చినా ఇల్లు గడపకపోతే ఏం చేస్తారు?... నాకు ఇచ్చిన తరవాత నీకు వాటిమీద మమకారం దేనికి?" అంది జానకి.

"జానకీ, నీ వేదాంతం కబుర్లెందుకు? నిజం సంగతి అన్నయ్యతో చెబితే తప్పేముంది? నీ వంటి మీద నగలేమయ్యాయి?... మెడలో పసుపుకొమ్ముతో పంపించారు పుట్టింటికి. చదువుకున్నవాడు, బుద్ధిమంతుడు, చిన్నవాడు అనుకున్నాను. జూదమాడి పెళ్ళాంనగలన్నీ తగలపెడతాడని నాకేం తెలుసు? దుబారాగా ఖర్చుపెట్టి సంసారం తగలబెట్టే అత్తగారు, ఏమీచేతకాని మామగారు దీనికి పోగయారు. ఈ సంసారం బాగుపడమంటే ఎలా బాగుపడుతుంది?" అంది సుబ్బమ్మ.

"చేయికాలిన తరవాత విచారిస్తే లాభం ఏమిటమ్మా! నా కర్మ నాది. వాళ్లందరినీ నిందించిన ఏం ప్రయోజనం?" అంది జానకి.

"రాఘవయ్య మంచివాడనే ఇప్పటికి కూడా నా అభిప్రాయం. ఇల్లాలివి నువ్వు కొంచెం మీ ఆయనను దారిలోపెట్టాలి" అన్నాడు నరసింహం.

"ఉద్యోగం, ఇల్లు రెండూ ఒకలాంటివే. తాలూకాఫీసు పనికి అంతులేదు. ఇల్లు కుశలం. ఇంట్లోకూడా ఉండడానికి ఆయనకు మనస్కరించదు. కుటుంబం బరువును మోయలేకపోయి, ఇతరత్రా మనస్సును మరలించుకునేందుకు సరదాకి పేకాట మొదలుపెట్టారు. అది మరో దారికి తిప్పింది. ఆయనను దారిలో పెట్టడానికి ఏమంత పెద్దనేరం చేశారని?" అంది జానకి.

"నరసింహం, అభిమానానికి మీ చెల్లెలికి లోటేమిటి! ఈసారి పండుగకు రమ్మని వెంటనే వ్రాయి. పండుగ వారం రోజులుకూడా లేదు. అతని ప్రయాణం ఖర్చుకి ఒక పాతిక పంపు" అంది సుబ్బమ్మ.

జానకి పాలబడ్డది సౌఖ్యంకాదు, అంతులేని శ్రమ. రాఘవయ్య ఇంట్లోలేనివేళల్లో పని ఇంకా హెచ్చయ్యేది. వేళపట్టున తిండి కూడా లేకపోయేది. రాఘవయ్య తల్లిని ఏమీ అనలేడు. భార్యను సముదాయించనులేడు. ఈ బాధ నుండి ముక్తి పొందడానికి పేకాట మొదలుపెట్టాడు. గాని దాని వల్ల కూడా అతనికి మార్గం కనిపించలేదు.

పండుగ వచ్చింది. రేపు పండుగనగా రాఘవయ్య ఒక్కడూ వచ్చాడు. జానకిని విడిచి ఉన్న నాలుగు నెలలు అతనికి నాలుగు యుగాలుగా ఉన్నాయి.

నరసింహం బావమరిదితో కలిసి పండుగ మూడు రోజులూ కులాసాగా గడిపాడు. రాఘవయ్య వచ్చిన తరవాత జానకిలో హెచ్చరిక కలిగింది. ఇంటి చికాకులన్నీ మరిచిపోయి సుబ్బమ్మ కూతుర్ని, అల్లుణ్ణి చూచి మురిసిపోయింది.

పండుగ వెళ్లిన వారం రోజుల వరకు రాఘవయ్య ఉండిపోయాడు. వెళ్లిపోయేముందు నరసింహం అతనిని తన గదిలోకి పిలిచాడు. కూర్చోబెట్టాడు.

"బావగారూ! మీరు చాలా ఇబ్బందిలో ఉన్నారని తెలిసింది. భూమిమీద అప్పు తెచ్చారని తోటను అమ్మజూపుతున్నారని తెలిసింది. ఆ భూమి, తోట చాలా కాలమయి అనుభవిస్తున్నాము. జానకికి ఈ భూమికి బదులు

డబ్బే ఇచ్చి ఉండేవాళ్లం. గాని ఈ భూమి మీద వచ్చే ధాన్యం, ఈ తోట నుంచి వచ్చే పళ్లు మీరు అనుభవించాలని మా ఉద్దేశం. భూమిని, రెండు వేలకు తనఖా పెట్టారని తెలిసింది. తోట అమ్మితే మరొక వేయి రూపాయలకన్న హెచ్చురాదు. మీకీడబ్బు చాలా అవసరమన్నమాట. మా చెల్లెలి ఒంటి మీదకూడా నగలు లేవు. వీటినిగురించి నేను చింతించను. మీకు ఈ చికాకుల వల్ల మనశ్శాంతి లేదు. ఇంటిబరువు మీ మీద ఉంది. నేను చేయగల సహాయం మరేమిటి? ఈ మూడువేల రూపాయలు తీసుకొని మీరు భూమిని విడిపించి, ఇల్లు సరిదిద్దుకోండి. ఈ డబ్బు శ్రమపడి చెమట ఓడ్చి నిలవచేసినది. మీ అదనుకు ఈ డబ్బు పనికివస్తే నేను కృతార్థుడనౌతాను" అని మూడువేల రూపాయలూ రాఘవయ్యచేతిలో ఉంచాడు.

రాఘవయ్య ముఖంలో నెత్తురుచుక్క లేదు. నరసింహం ముఖంలోకి చూస్తూ కొద్దిసేపు ఉండిపోయాడు. తరవాత తేరుకున్నాడు.

"బావగారూ! మీరు చెప్పిన వాటిలో అసత్యాలేమి లేవు. ఈ డబ్బుతో భూమి విడిపించినా, మళ్లా పరిస్థితి మొదటికి వస్తుందనే భయం. నేను మీమీద ఆధారపడి, మీ డబ్బుకోసం జీవితాంతం ఎదురుచూస్తూ ఉండాలి. మీకు నేను చెప్పవలసినవాడనుకాను. ఈ డబ్బు నాకు అక్కరలేదు. మీ ఆదరానికి దూరమవుతాను. ఈ డబ్బు మనని దూరం చేస్తుందిగాని దగ్గిరగా తీసుకొని రాదు" అని రాఘవయ్య అన్నాడు.

"ఈ డబ్బు ప్రస్తుతం మీ కవసరం. తీసుకోండి."

"అవసరమే. కాని ఒక షరతు. దీనిని మీరు తిరిగి తీసుకునేపక్షంలోనే తీసుకుంటాను. ఇది వడ్డీలేని అప్పు. మీ ఉపకారం అది చాలు."

రాఘవయ్యకు చెల్లెలి నిచ్చినందుకు నరసింహం గర్వించాడు. 'స్వతంత్రమైన అభిప్రాయాలుగల యోగ్యుడు. ఈ రోజు కాకపోతే మరొక రోజు ముందుకు వస్తాడు. జానకి సుఖంగా ఉండడమే తనూ, సుబ్బమ్మ కోరేది. బాంకులో మరి రెండు వందలు మాత్రం ఉన్నాయి. అవి చెల్లెలి పురిటికి చాలు. శరీరంలో బలం ఉన్నప్పుడు ఆర్జనకు కొదవేమిటి?' అనుకున్నాడు నరసింహం.

## 32

శారద, ఉషారాణి ఫిలాసఫీ అనర్సులో ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరికీ క్లాసులు వచ్చాయి. ఉషారాణి ఫలితాలు తెలిసిన నాటి రాత్రి చిన్న డిన్నరు ఏర్పాటు చేసింది. సుబ్రహ్మణ్యం, శారద, మరి ముగ్గురు క్లాసుమేట్లు ఆ విందుకు హాజరయ్యారు. మేడమీద గదిలో ఏర్పాటులు జరిగాయి. శారదకూడా అన్నివిధాల సహాయం చేసింది. తీపిసామాను హోటలు నించి తెప్పించారు. సర్జన్ శ్రీనివాసరావు, లాయర్ సుబ్రహ్మణ్యం ఆ విందులో ఉపన్యాసకులు.

ఉషారాణి గులాబీరంగు మైసూరు సిల్కుచీర కట్టుకుంది. శారద లేతనీలం ధర్మవరం పట్టుచీర కట్టుకుంది. ఉషారాణి మెడలో పొల్లనెక్లెసు మెరిసింది. శారద ముక్కపుడకలోని వజ్రాలు ఆమె ముఖంలో ఏ మాత్రం కదలిక కలిగినా తళుక్కుమనేవి. ఉషారాణి నడకలో ఒయ్యారం, శారద నడకలో సౌమ్యత గోచరించేవి.

సుబ్రహ్మణ్యం కళ్లు ఉషారాణిమీద నిలిచిపోయాయి. శ్రీనివాసరావు శారదను పరిశీలనదృష్టితో చూస్తున్నాడు. ఆమెను అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆమెను పొందినవాడు నిజంగా అదృష్టవంతుడే.

విందు ముగిసిన తరవాత ఇష్టాగోష్ఠిలో మరికొన్ని విషయాలు బైటపడ్డాయి. నాగభూషణంగారు ఉషారాణిని సుబ్రహ్మణ్యానికిచ్చి, శారదను తమకోడలుగా చేసుకోవాలని తాము, సుగుణాంబ కోరుతున్నట్లు బహిరంగంగా చెప్పారు.

ఉషారాణి సిగ్గుతో ముఖం వంచుకుంది. శారద ముఖంలో ఆనందంగాని, సిగ్గుగాని కనుపించలేదు. ఆమెలో ఆమెనవ్వుకుంది. ఆ నవ్వు పెదవులమీద వెన్నెలలు చిమ్మింది. దానినందరు అంగీకారచిహ్నంగా పరిగణించారు. శ్రీనివాసరావుమాత్రం ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఆదివారం వచ్చింది. కాబోయే వధూవరులు పిక్నిక్ కి బయలుదేరారు. లోవతోటలో విందు ఏర్పాట్లుచేశారు. కారియర్లు, ఫ్లాస్కులు పట్టుకొని నలుగురు బయలుదేరారు. చిన్నపడవలో నలుగురు సముద్రపుకాలవదాటి లోవతోట చేరుకున్నారు. సముద్రపుగాలికి ఉషారాణి పైట ఎగిరి సుబ్రహ్మణ్యం ముఖంమీదపడి గిలిగింతలు పెట్టేది. శారద అనంతమైన నీలాకాశాన్ని చూస్తూ, మధ్యాహ్నపు ఎండకు తళతళలాడే కెరటాలను గమనిస్తూ శ్రీనివాసరావుకు ఎదురుగా కూర్చున్నా ధ్యానం అతనిపై నిలపలేకపోయింది.

ఉషారాణి, శారద కొంతసేపు అటు, ఇటు తిరిగి వచ్చారు. మగవాళ్లిద్దరు మాట్లాడుతూ కూర్చున్నారు. తెచ్చినవి కాళీచేసి, కొంచెంసేపు విశ్రమించారు. ఉషారాణి, సుబ్రహ్మణ్యం తిరిగిరావడానికి వెళ్లిపోయారు. వాళ్లొకవేపు, శారద శ్రీనివాసరావు మరొకవేపు.

ఉషారాణి సుబ్రహ్మణ్యం తొడమీద తల పెట్టుకొని అతని ముఖంలోకి చూస్తూ మాట్లాడుతున్నది. మధ్యమధ్య అతను వంగి గులాబీలవంటి ఆమె పెదవులను చుంబిస్తున్నాడు. అతనిని మధ్యమధ్య గిలిగింతలు పెడుతూ ఉషారాణి నవ్వుతున్నది. జీవితం ఆనందమయంగా గడిపే శుభసమయం ఎంత వేగంగా వస్తుందని వాళ్లు లెక్కలు కట్టడం మొదలుపెట్టారు. సుబ్రహ్మణ్యం ఎక్కడ ప్రాక్టీసుపెడితే బాగుంటుందో, ఏ ఇల్లు కొంటే మంచిదో, ఏ రకం ఫర్నిచరు ఇంట్లో ఉండాలో, ఏ విధంగా పార్టీ ఇవ్వాలో వాళ్లు ఆలోచించారు.

శ్రీనివాసరావు శారదకు కొంచెం దూరంలో కూర్చున్నాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. శారద ఆటంకపెట్టలేదు. పెండ్లి ఎంతో దూరంలో లేదు. జలపాతాన్ని సమీపించే పడవలా ఉంది ఆమె మనస్సు.

"శారదా, నీతో ఏకాంతంగా మాట్లాడాలని ఎన్నాళ్లనుండో కోరుతున్నాను. ఆ మంచిరోజు ఇన్నాళ్లకుగాని రాలేదు. నీవు నా జీవితసహచరివి కాబోతున్నావు. ఇంతకన్న వేరు అదృష్టముందా!"

"మీరు చాలా ఉత్తములు. ఉన్నతమైన అభిప్రాయాలు కలవారు. మీవంటివాళ్లు సామాన్యులకు లభించరు."

"శారదా! వివాహానికి వధూవరుల అంతస్తులే ప్రధానమయినవని అనుకుంటాను. వీటికన్న మనస్సులు కలిసిన వివాహాలు ఆనందదాయకములని నా అభిప్రాయం."

"సహజీవనానికి మనస్సులు కలియడం చాలా తోడ్పడుతుంది. అవసరమా, అనవసరమా అనే ప్రశ్న ఒకప్పుడు రాదు. మనస్సులు కలియనివారుకూడా సంసారాలు చేస్తున్నారు. బాగానే నడుస్తున్నాయి."

"నేను చాలా సంసారాలు చూచాను. మనస్సులు కలియడమన్న విషయమే గుర్తులేని సంసారాలున్నాయి. జీవితంలో ఒకరు అవసరం మరొకరికి ఉంటుంది. ఒకరిమీద ఒకరు ఆధారపడవలిసి ఉంటుంది. ఒండొరుల మీద కోరిక సామాన్యంగా ఉంటుంది. ఇది మామూలుగా ఆలోచించవలసినవి. కాని కొందరు మనసులు చాలా సున్నితమైనవి. అవి గాయపడడం మనస్సులు కలియనినాడు జరుగుతుంది."

శారద అతని ముఖంలోకి చూచింది. అతను ఆమె మృదువైన హస్తాన్ని ముద్దు పెట్టుకొని, ఆమెముఖంలో చూస్తూ ఉండిపోయాడు.

"శారదా! నువ్వు అందరివంటిదానివి కావు. నిన్ను అందరూ అర్థం చేసుకోలేరు. మూడు సంవత్సరాలయి నీతో తిరుగుతున్నాను. గాని ఇప్పటికికూడా కృతకృత్యుణ్ణి కాలేకపోయాను. నీ కీ వివాహం సమ్మతమేనా?"

"ఇది అందరికీ సమ్మతం. నా అనుమతి అవసరం లేదు. నాతో కాపరం సుఖంగా ఉండదని సందేహిస్తున్నారా?"

"లేదు శారదా! నీతో కాపరం చేయడంకన్న సౌఖ్యకరమైనది లేదు. సౌఖ్యమనేది నా ఒక్కడిదే కాదు. నీకుకూడా అందులో భాగం ఉండాలి."

"మీ సౌఖ్యానికి అనుగుణంగా మెలుగుతాను. ఇది నా వాగ్దానం. పెండ్లికి నా ఆటంకం లేదు."

శారద అతని కళ్లలోకి చూచింది. ఆమె కళ్లనుండి జారిపడే కన్నీటిబొట్లు చూచాడు అతను.

*(ముగింపు వచ్చే నెలలో)*

COMMENTS